సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 11 । మే । 2024



సైలెన్స్ ప్లీజ్..!

సార్వత్రిక ఎన్నికల సమరానికి మరికొద్ది గంటలే సమయం ఉంది. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

- VIIIలో



ఆలయాలకు గత వైభవం

గడిచిన చంద్రబాబు పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వాటిలో హిందూ దేవాలయాలు ప్రధానంగా ఉన్నాయి.

- VIIIలో

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మండపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆశీనులు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు.

న్యూస్‌రీల్

ఓటు వేసేందుకు గుర్తింపుకార్డు తప్పనిసరి



పార్వతీపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు 13 రకాల గుర్తింపు కార్డులను వినియోగించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. ఓటరు గుర్తింపుకార్డు కలిగిన ఓటర్లు దానిని పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపుకార్డుగా ఉపయోగించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది పంపిణీ చేస్తున్న ఓటరు స్లిప్ కేవలం పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేసేందుకు మాత్రమే అని, ఆ స్లిప్‌ను గుర్తింపు కార్డుగా ఉపయోగించేందుకు అవకాశం లేదన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎటువంటి ఎల్రక్టానిక్ పరికరాలు కాని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఓటరు గుర్తింపు కార్డు లేని ఓటర్లు ఈ కింద తెలియజేసిన ఏదో ఒక కార్డును గుర్తింపుకార్డుగా చూపించవచ్చని తెలిపారు.

గుర్తింపుకార్డులివే..

ఆధార్ కార్డు, ఎంఎస్ఆర్ఈజీఎస్ జాబ్‌కార్డ్, బ్యాంకు, తపాలాశాఖకు సంబంధించిన పాస్‌బుక్, కేంద్ర కార్మికశాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, కేంద్ర కార్మికశాఖ పథకం జారీచేసిన స్మార్ట్‌కార్డు, పాస్‌పోర్టు, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, ఉద్యోగులకు జారీచేసిన ఐడెంటిటీకార్డులు, ఎమ్మెల్యే, యునిక్ డిజిబుల్టీ ఐడీ కార్డు, ఎమ్మెల్సీ, ఎంపీ జారీచేసిన గుర్తింపు కార్డు ఉపయోగించుకోవచ్చని వివరించారు.

సీతంపేటలో ఈదురుగాలులు, భారీవర్షం



సీతంపేటలో కురుస్తున్న వర్షం

సీతంపేట: మండల కేంద్రం సీతంపేటలో శుక్రవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కాగా జీడిమామిడి పంటలకు కాస్త నష్టం వాటిల్లిందని గిరిజన రైతులు తెలిపారు.

పోలింగ్ ఏర్పాట్ల పరిశీలన

సాలూరు: ఎన్నికల సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.

కురుపాం టీడీపీలో...
ఎవరి వ్యూహం వారిదే..!

‘ఆలూ లేదు చూలూ లేదు కొడుకుపేరు సోమలింగం అన్నారట... అలా ఉంది కురుపాంలో టీడీపీ పరిస్థితి. ఎమ్మెల్యే అభ్యర్థిగా ఓ గ్రామస్థాయి నాయకురాలికి సీటు రావడంతో అక్కడి పార్టీ పెద్దలు పండగ చేసుకుంటున్నారు. గెలిస్తే అధికారమంతా తమదే అంటూ అప్పుడే తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. దోచుకునేందుకు స్కెచ్‌లు గీసుకుంటున్నారట. అభ్యర్థి తరఫున ఖర్చుపెడుతున్న ఓ యువనాయకుడు కురుపాంలో కనిపించడం అరుదు. ఎన్నికల వేళ మాత్రమే ఈ ప్రాంత ప్రజలకు కనిపించే ఆ నాయకుడితో డబ్బును విచ్చలవిడిగా ఖర్చుచేయించడం.. కాసిన్ని డబ్బులు దోచుకుని దాచుకోవడం.. అభ్యర్థికి విషయ పరిజ్ఞానం తక్కువ కావడంతో అధికారాన్ని వెలగబెట్టేందుకు మరో ఇద్దరు నాయకులు కాసుకు కూర్చున్నట్టు సమాచారం. ఈ విషయం తెలిసిన నియోజకవర్గ ప్రజలు, ఆ పార్టీ గ్రామస్థాయి నాయకుల్లో కొందరు వారి వ్యూహాలు బెడిసికొట్టేలా.. ఓటుతో బుద్ధిచెప్పేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ పరిణామాలతో అధికార పార్టీ అభ్యర్థి హ్యాట్రిక్ విజయం ఓటింగ్‌కు రెండు రోజుల ముందే ఖాయమైందన్న చర్చ జోరుగా సాగుతోంది.



- అధికారం కోసం అర్రులు చాస్తున్న నాయకులు
- డబ్బులు విచ్చలవిడిగా ఖర్చుచేస్తున్న పారాచ్యూట్ నాయకుడు!
- అధికారం వస్తే లాక్కునేందుకు మరో ఇద్దరు పన్నాగం
- కురుపాంలో టీడీపీకి గడ్డుకాలం
- నాయకుల కుటిల రాజకీయాలపై పార్టీ శ్రేణుల్లోనే విముఖత!
- ఓడిపోవడం ఖాయమన్న నిర్ధారణ కొచ్చిన వైనం

సాక్షి, పార్వతీపురం మన్యం:

కురుపాం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థిగా ఓ గ్రామస్థాయి నాయకురాలిని బరిలో నిలిపినా.. వెనుక నడిపిస్తున్నది కొందరు ‘పెద్దలు’ అన్న విషయం తెలిసిందే. వారిలో ముఖ్యుడు రాజ కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ.. ఎప్పుడూ ఇక్కడ ఉన్నది లేదు. పెరిగిందీ లేదు. ఏదో విహార యాత్రకు వచ్చినట్లు రావడం, వెళ్లిపోవడం మినహా.. నియోజకవర్గంపై ఏ మాత్రం అవగాహన లేదు. అటువంటి వ్యక్తి తొలుత ఇక్కడ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఆయనకు టికెట్ వ్యతిరేకించిన వారిలో ఆ కుటుంబానికే చెందిన సీనియర్ నేత ఒకరు ఉన్నారు. ‘మత్తు’లో కుటుంబం చిత్తవుతుందన్న బెంగ, సొంత కుటుంబంలోనే ఆ యువనాయకుడిపై సదాభిప్రాయం లేకపోవడం, నియోజకవర్గంపై పట్టు లేకపోవడంతో టికెట్ దక్కలేదు. ఆయనకు ఉన్న అర్హత అంతా డబ్బు ఖర్చు పెట్టడమే. దీంతో తెర ముందుకు ఓ చిన్న నాయకురాలిని తీసుకొచ్చి, తెర వెనుక తాను చక్రం తిప్పుదామన్న ఆశతో ఆ యువనేత ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో అంతా తానై నడిపిస్తున్నారు. అభ్యర్థి పాత్ర నామమాత్రంగానే మారిపోయింది. ఒకానొక దశలో అభ్యర్థి ఆ యువ నాయకుడే అన్న చందంగానే పార్టీ క్యాడర్ వ్యవహరిస్తూ.. అసలైన అభ్యర్థిని పూర్తిగా పక్కన పెట్టేశారు. మరోవైపు ఎంపీటీసీగా పనిచేసిన ఆమెకు నియోజకవర్గంపై పట్టు శూన్యమని టీడీపీ నాయకులే పెదవి విరుస్తున్నారు. ఆమెకు స్థానిక సమస్యలపై కనీస అవగాహన లేదని, ఇటువంటి వ్యక్తిని గెలిపిస్తే రేపు తమ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తేవడం, అసెంబ్లీలో తమ ప్రాంత సమస్యలపై ఏం నోరు విప్పగలరని, ఏం సాధించుకురాగలరని పార్టీ శ్రేణులే కాదు నియోజకవర్గంలోని మేధావి వర్గం, చదువుకున్నవారంతా అభిప్రాయపడుతున్నారు.

కాచుకుని కూర్చున్న ఆ ఇద్దరు..

జయాపజయాలు పక్కనపెడితే, ఎన్నికలయ్యాక అభ్యర్థి తరఫున ఖర్చుచేస్తున్న ఆ యువనాయుడు ఇక్కడుంటాడన్న నమ్మకం ఎవరికీ లేదు. ఆ అవకాశాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు మండలస్థాయి నాయకులు ఇద్దరు ‘రామలక్ష్మణు’ల అవతారం ఎత్తారు. వారిద్దరూ కూడా గతంలో వేర్వేరుగా తమ వర్గానికి టికెట్లు ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇద్దరు అభ్యర్థులను తెర పైకి తెచ్చారు. ఇప్పుడంతా కలిసి టీడీపీ అభ్యర్థి వైపే ఉన్నట్టు తెరపై కనిపిస్తున్నప్పటికీ.. తెర వెనుక అధికారంపై పట్టు సాధించేందుకు లోపల ఎవరి వ్యూహాలు వారు రచిస్తున్నారన్న మాట నియోజకవర్గంలో గట్టిగా వినిపిస్తోంది. తమ స్వార్థ రాజకీయాల కోసం గిరిజన మహిళను బలి చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని, ఇటువంటి వారిని నమ్మి ఓట్లేస్తే అంతిమంగా నష్టపోయేది తామే అన్న భావన ప్రజల్లో ఏర్పడింది. అధికారం రాకముందే ఎవరి స్థాయిలో వారు దోచుకునేందుకు ఎత్తుగడలు వేయడం, అభ్యర్థిని కనీసం పట్టించుకోకపోవడం వంటివి చూసిన ‘ఆమె’... నన్నెందుకు బరిలో దించారంటూ వాపోతున్నట్టు సమాచారం.

జగన్ అంటేనే విశ్వాసం

ఏజెన్సీలో ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీవైపే కనిపిస్తోంది. కేవలం 59 నెలల పాలనలో అర్హతే కొలమానంగా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందాయి. అవినీతి రహితంగా, నేరుగా బ్యాంకు ఖాతాలకే పథకాల డబ్బులు జమయ్యాయి. ఠంచన్‌గా పింఛన్ ఇంటివద్దనే అందుతోంది. విద్య, వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. సిగ్నల్స్ సమస్యలు పరిష్కారమయ్యాయి. గిరిజన గూడలకు ప్రగతి‘బాటలు’ పడ్డాయి. వంతెన కష్టాలు తీరాయి. గిరిజనులు ఏళ్లతరబడి సాగుచేసే భూములకు శాశ్వత హక్కుపత్రాలు చేతికందాయి. సచివాలయ వ్యవస్థతో వ్యయప్రయాసలు లేకుండా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ప్రతీ గిరిజన కుటుంబంలోనూ ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడి నాయకురాలికి నేరుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో నిరంతరం మాట్లాడే చొరవ ఉండడం ఈ ప్రాంత అభివృద్ధికి అధిక నిధులు మంజూరవుతున్న విషయం కళ్లకుకడుతోంది. అందుకే సంక్షేమ పథకాలతో తమ జీవితాలను మార్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు. ఇవన్నీ కూటమి నేతల్లో గుబులు పుట్టిస్తున్నాయి. చంద్రబాబు వచ్చి నియోజకవర్గానికి మేలు చేస్తానని హామీలు ఇచ్చినప్పటికీ.. గత అనుభవాల దృష్ట్యా ఏజెన్సీ ప్రజలు నమ్మే పరిస్థితి కనిపించడం లేదు.

మాదిగల మద్దతు వైఎస్సార్‌సీపీకే

బలిజిపేట: సార్వత్రిక ఎన్నికల్లో మాదిగల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాదిగల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండి..మాదిగల సమగ్రాభివృద్ధికి కావాల్సిన తోడ్పాటును అందిస్తానన్న ముఖ్యమంత్రి.. జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. చంద్రబాబులా మాట ఇచ్చి మోసం చేసే నైజం జగన్మోహన్ రెడ్డికి లేదని, అటువంటి నాయకుడికి మామద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరఫున ప్రచారం చేస్తూ, పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ బలిజిపేట మండల కన్వీనర్ కన్నారావు, నాయకులు ఆనందరావు, దాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు, నాయకులు

వెంకటరాజపురం పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ వెంకట రాజపురం, నిమ్మలపాడు వద్ద ఉన్న గుమ్మిడిగెడ్డ వాగులో తిష్ఠ వేసిన ఏనుగులు శుక్రవారం ఉదయం పాత నిమ్మలపాడు వచ్చి అరటిపంటను ధ్వంసం చేశాయి. పొలాలవరకు వచ్చిన ఏనుగులు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉందని రైతులతో పాటు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

దీవించండి..!

- జోరుగా సాగుతున్న ఎన్నికల ప్రచారం

ప్రచార పర్వం

నమస్తే..అవ్వా..తాత.. అమ్మా..అక్కా..అన్నా..హాయ్ చెల్లి.. తమ్ముడూ అని ఆప్యాయంగా పిలుస్తూ..నిద్రాహారాలు, ఎండా వానను లెక్కచేయకుండా ప్రజాభిమానం చూరగొనేందుకు సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు దూసుకుపోతున్నారు. పార్టీ శ్రేణులు, అనుచరులతో గ్రామాల్లోకి వెళ్తూ ప్రజలతో మమేకమవుతూ తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తూ ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ప్రచారం సందర్భంగా తమ దగ్గరకు వస్తున్న అభ్యర్థులకు ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా స్వాగతం పలుకుతూ హారతులిచ్చి ఆశీర్వదిస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



పాచిపెంట: పాచిపెంటలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర



పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ప్రచారం



బలిజిపేట: నూకలవాడ రోడ్ షోలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు



కురుపాం: శివ్వన్నపేటలో వైఎస్సార్‌సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పుష్పశ్రీవాణికి హారతి ఇచ్చి, స్వాగతం పలుకుతున్న మహిళలు

చేతకాక.. చేవలేక..!

నాకు ఒక కన్ను పోయినా ఫరవాలేదు. పక్కవాడికి రెండు కళ్లూ పోవాలన్న చందంగా ఉంది టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అండ్ కో, ఎల్లో మీడియా పరిస్థితి. రాష్ట్రంలోని ప్రజల భూములకు శాశ్వత భూ హక్కు కల్పించి పక్కా రికార్డులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తయారు చేయిస్తుంటే ఓర్చుకోలేకపోతున్న చంద్రబాబు, ఆయన భజన బృందం ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతోంది. రాష్ట్ర ప్రజలను మెప్పించలేక, తాము విడుదల చేసిన అబద్ధపు మేనిఫెస్టోతో ఓటర్లను నమ్మించలేక నానా యాతన అనుభవిస్తోంది. ఎలాగైనా ఓటర్లను తమ విషకౌగిలిలోకి లాక్కోవాలన్న పన్నాగంతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, భూముల రీసర్వేపై విషప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది.

–పార్వతీపురం టౌన్

- ఎన్నికల్లో ఓటమి భయంతో కుట్రలు
- టీడీపీ హామీలను ప్రజలు నమ్మడం లేదని ఆక్రోశం
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై మద్దతుదారు మీడియాతో విషప్రచారం
- రాష్ట్రంలో వందేళ్ల క్రితం చేపట్టిన భూముల రీ సర్వేపై విషం
- మూడో దశ రీసర్వే జరగకుండా ప్రజలకు ఐవీఆర్ఎస్ కాల్స్
- బాబును గద్దెనెక్కించాలని ఎల్లోమీడియా తాపత్రయం
- ప్రజలను అభద్రతా భావంలోకి నెట్టి గెలవాలనే పన్నాగం

వాస్తవానికి టీడీపీ జమానాలో రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూములను 22(ఎ) జాబితాలో చేర్చడంతో..పక్కా రికార్డులున్న భూముల రైతులు నానా తిప్పలు పడ్డారు. అవసరమైన సమయంలో భూములు విక్రయించలేక అప్పులు చేయాల్సి వచ్చేది. ఈ తరుణంలో అధికారం చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 22(ఎ) జాబితా నుంచి లక్షలాది ఎకరాల భూములను తొలగించారు. వందేళ్ల తర్వాత అధునాతన సాంకేతికతతో భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టి దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారు.

అయితే..భూ సర్వే ప్రక్రియపై తొలినుంచీ విషప్రచారం చేస్తున్న పచ్చ విషనాగులు ఎన్నికల వేళ మళ్లీ బుసకొడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను భ్రష్టు పట్టించి, ప్రజల్ని ఆందోళనకు గురిచేసేలా తప్పుడు ప్రచారానికి దిగిన చంద్రబాబుకు తోడుగా రాజగురివింద రామోజీ రావు తన పత్రికలో పేజీలకు పేజీలు అబద్ధాలు అచ్చేసి విషం చిమ్ముతున్నారు.

శాశ్వత భూహక్కు ద్వారా భూములు పదిలం

రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ భూములు పదిలం కానున్నాయి. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి వస్తున్న అర్జీల్లో భూ సమస్యలకు సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో జరిగిన తప్పిదాలతో భూ వివాదాలు పెరగడంతో ప్రభుత్వం రీ సర్వేకు నిర్ణయం తీసుకుంది. దీంతో దాదాపు భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. రీ సర్వే కోసం సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన రేఖాంశాలు, అక్షాంశాలు గుర్తించి హద్దులు నిర్ణయిస్తున్నారు. దీంతో గ్రామాల సరిహద్దుల నుంచి నివాస ప్రాంతాల ఇళ్లు, ఖాళీ స్థలాల వరకు మొత్తం ఇమేజ్‌లతో పాటు హద్దులు పక్కాగా నిర్ణయిస్తున్నారు.



పార్వతీపురం మండలంలోని బందలుప్పి గ్రామంలో రీసర్వే (ఫైల్)

రెండు దశలు పూర్తి..

పార్వతీపురం మన్యం జిల్లాలో చేపట్టిన రీ సర్వే..రెండు విడతల్లో మొత్తం 248 గ్రామాల్లో పూర్తయింది. మొదటి దశలో 15 మండలాల్లోని 95 గ్రామాల్లో, రెండో దశలో 15 మండలాల్లోని 153 గ్రామాల్లో 3,09,341 ఎకరాలకు సంబంధించిన రీ సర్వే పూర్తి చేశారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి మూడో విడతలో 15 మండలాల్లోని 107 గ్రామాలు లక్ష్యంగా రీ సర్వేను వేగవంతం చేశారు. దాదాపు అది కూడా పూర్తి కావస్తోంది.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారా జిల్లా మొత్తం కవర్ అయ్యేలా 5 బేస్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఒక్కో బేస్‌స్టేషన్ సుమారు 35 కిలోమీటర్ల పరిధి వరకు సిగ్నల్స్ తీసుకుంటుంది. దీంతో 5 బేస్ స్టేషన్ల ద్వారా జిల్లా మొత్తం కవర్ కానుంది. జిల్లాలోని పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాలకొండ ప్రాంతాల్లో బేస్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. రీ సర్వేలో రోవర్లను వినియోగిస్తున్నారు. ఈ రీ సర్వేలో సర్వే ఆఫ్ ఇండియా, గ్లోబల్ పొజిషన్ సిస్టం, డ్రోన్ టీమ్, హై ప్రిసన్ లెవెలింగ్ బృందాలతో పాటు మండల, గ్రామ సర్వేయర్లు పనిచేస్తున్నారు.

సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి

ఏళ్ల తరబడి రైతు కుటుంబాల్లో చీకట్లు నింపిన నిషేధిత భూముల సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిష్కరించారు. టీడీపీ జమానాలో 22(ఎ) జాబితాలో భూములు చేర్చడం వల్ల క్రయ విక్రయాలకు అవకాశం లేక, ప్రభుత్వ పథకాలు అందక, చివరికి విత్తనాలు, పురుగుమందుల సబ్సిడీ కూడా దక్కక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ తరుణంలో వైఎస్సార్‌సీపీ హయాంలో భూముల హద్దులు పక్కాగా నిర్ణయించేలా రీ సర్వే చేస్తూనే, మరో పక్క నిషేధిత జాబితాలోని భూములకు మోక్షం కల్పించారు. జిల్లాలో రైతులకు సంబంధించి సర్వీస్ ఇనాం భూములు, 20 ఏళ్లకు పైబడిన ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూములకు సంబంధించి రైతులకు చెందిన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారు. అదేవిధంగా పెద్ద సంఖ్యలో రైతులకు సంబంధించి చుక్కల భూములకు క్లియరెన్స్ ఇచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు పొందిన వారికి సంబంధించి నిషేధిత జాబితా నుంచి తొలగించారు. నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములే కాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటీవల రైతులకు కొత్తగా అసైన్డ్ చేసిన భూములకు పాస్‌పుస్తకాలు అందజేశారు.

జిల్లావ్యాప్తంగా రీ సర్వే ఇలా..	
మండలాలు	15
రెవెన్యూ గ్రామాలు	965
జియోగ్రాఫికల్ సర్వే	2340.54 చదరపు కిలోమీటర్లు
మొదటి విడత సర్వే అయిన గ్రామాలు	95
రెండవ విడత సర్వే చేసిన గ్రామాలు	153
మూడవ విడత సర్వే లక్ష్యం గ్రామాలు	107
మూడవ విడత విడత సర్వే పూర్తి చేసిన గ్రామాలు	27
విధుల్లో పాల్గొన్న సర్వేయర్లు	310 మంది



భామిని మండలం కోసలిలో రీసర్వే (ఫైల్)

క్లుప్తంగా

శ్రీరాముడు ఆదర్శప్రాయుడు..



ఆధ్యాత్మిక ప్రవచనం అందజేస్తున్న చినజీయర్ స్వామి

విజయనగరం టౌన్: శ్రీరామచంద్రమూర్తి ఎప్పటికీ ఆదర్శప్రాయుడని చినజీయర్‌స్వామి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమం కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మానవ రూపంలో పుట్టిన భగవంతుడు శ్రీరాముడని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గుణగణాలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా విజయ కుమార్, చెరుకూరి శ్రీధర్, రుత్విక్కులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

విజయనగరం క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు జిల్లా పరిధిలో ఉన్న 149 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 28 రెస్టారెంట్లు, బార్లు, 92 కల్లు దుకాణాలు, రెండు మెథనాల్ యూనిట్స్, ఒక డినేచర్డ్ ఇథనాల్ యూనిట్, 16 డినేచర్డ్ స్పిరిట్, ఆరు మొలాసిస్ యూనిట్లను కలెక్టర్ ఆదేశాల మేరకు మూసి వేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎన్‌వీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు ఎవ్వరూ మద్యం తాగడం గాని, విక్రయించడం గాని చేయరాదని పేర్కొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విజయనగరం ఫోర్ట్: అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున జిల్లాలోని 15 మండలాల్లో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించినట్లు యూత్‌క్లబ్ ఎక్వీస్ ఫర్ జస్టిస్ సమన్వయకర్త జి.ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల ఎన్నో అనర్థాలు కలుగుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం. ప్రసాదరావు, రామకోటి, ఫల్గుణ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం నమోదుకు ప్రత్యేక సిబ్బంది

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



విజయనగరం అర్బన్: కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల పోలింగ్ శాతాన్ని నమోదు చేయడానికి సెక్టార్ల వారీగా ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, పోలింగ్ రోజున (13వ తేదీ) ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని కలెక్టరేట్‌కు తెలియజేయాలన్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఓవరాల్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారని.., సెక్టార్ వారీగా సేకరించిన సమాచారాన్ని కన్సాలిడేట్ చేసి అందించడానికి ఒక ప్రత్యేక టీమ్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ బృందాలు 12వ తేదీన కంట్రోల్ రూమ్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. పోలింగ్ రోజుకు ముందురోజున పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బంది హాజరు, మాక్ పోలింగ్ ప్రారంభం, ఓటర్ టర్న్ అవుట్, తదితర వివరాలను పోలింగ్ స్టేషన్ల వారీగా రిపోర్ట్ చేయాలని సూచించారు. పోలింగ్ అనంతరం రిసెప్షన్ సెంటర్‌కు చేరేవరకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు.

పైడితల్లి ఆలయానికి ఊయల వితరణ



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఊయల

విజయనగరం టౌన్: భక్తులందరూ తమ పిల్లలను అమ్మవారి పాదాల చెంత ఉంచి ఆశీర్వాదం తీసుకోవడం పరిపాటి. ఈ క్రమంలో పైడితల్లి ఆలయంలో చిన్నారుల కోసం శుక్రవారం ఊయల ఏర్పాటు చేశారు. డాక్టర్ హరి జగన్ ఊయలను ఈఓ డీవీవీ ప్రసాదరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ, భక్తులు తమ చిన్నారులను అమ్మ సన్నిధానంలో ఊయలలో వేసి ఆశీర్వాదం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు తాళ్లపూడి ధనుంజయ్, ఏడిద వెంకటరమణ, మాజీ అర్చకుడు దూసి కృష్ణమూర్తి, మాజీ సిబ్బంది అప్పలనాయుడు, ఆర్.సూర్యపాత్రో, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286

ఉపాధ్యాయ ఉద్యోగ కల.. నెరవేరిందిలా..

- 1998 డీఎస్సీ అభ్యర్థుల సమస్యకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చక్కని పరిష్కారం
- అర్హులందరికీ ఉపాధ్యాయ పోస్టుల కేటాయింపు
- జిల్లాలోని 490 కుటుంబాల్లో కొత్త వెలుగు
- నెరవేరిన ఉపాధ్యాయ కల
- సీఎం నిర్ణయంతో రాష్ట్రంలో 4,072 మందికి కొలువులు
- మా మంచి సీఎం జగన్ అంటూ ప్రశంసలు



"'ఉపాధ్యాయుడు కావాలన్నది కల. డీఎస్సీకి కష్టపడి చదివాను. 1998 డీఎస్సీలో అర్హత సాధించినా కోర్టు వివాదంతో ఉద్యోగం రాలేదు. ఏళ్ల తరబడి పాలకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. సీఎం జగన్మోహన్‌రెడ్డి రూపంలో నా కల నెరవేరింది. విద్యార్థులకు చక్కగా బోధిస్తున్నాను. నా కల నెరవేర్చిన సీఎం రుణం తీర్చుకోలేనిది. మా మంచి సీఎం ఆయన.

– ఎల్.కోటకు చెందిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయుడు మాట ఇది."

"మాది కొత్తవలస మండలం. ప్రజాసంకల్పయాత్రగా వచ్చిన అప్పటి ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మా సమస్యను వివరించాం. అర్హత సాధించి ఉద్యోగానికి దూరమైన తీరును తెలియజేశాం. అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామన్నారు. ఉద్యోగాలు కల్పించి మా కుటుంబాల్లో కొత్త వెలుగు నింపారు. ఈ రోజు పిల్లాపాపలతో ఆనందంగా ఉన్నామంటే ఆయన దయే. ఏ ముఖ్యమంత్రి తీసుకోలేని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. పాలకుడంటే అలా ఉండాలి. గతంలో మేము చదువుకునేటప్పుడు పాఠశాలలో కనీసం మరుగుదొడ్డి ఉండేది కాదు. ఇప్పుడు పాఠశాలలను చూస్తే ముచ్చటేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉజ్వల భవితకు ప్రభుత్వ బడులు భరోసాగా నిలుస్తున్నాయి.

– ఉద్యోగం పొందిన ఓ ఉపాధ్యాయుడి ఆనందం ఇది"

లక్కవరపుకోట: వారంతా రాత్రీ పగలు కష్టపడి చదివారు. ఉపాధ్యాయ కోర్సు పూర్తిచేసి డీఎస్సీకి అర్హత సాధించారు. కోర్టు వివాదంతో వారు ఉద్యోగాలకు దూరమయ్యారు. వారి సమస్య పరిష్కారానికి రెండు దశాబ్దాల పాటు ఏ పాలకుడూ కనీసం చొరవ చూపలేదు. సాహసం చేయలేదు. వారి వేదనను పట్టించుకోలేదు. వారికి మేలు కలిగేలా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 2018 సంవత్సరంలో నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో 1998 డీఎస్సీ అభ్యర్థులు వారి సమస్యను ఏకరువుపెట్టారు. ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయ అభ్యర్థుల సమస్యను జగన్‌మోహన్‌రెడ్డి సావధానంగా ఆలకించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 1998 డీఎస్సీలో అర్హత పొందిన వారందరికీ ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా 4,072 మందికి, జిల్లాలో 490 మందికి పోస్టింగ్‌లు కేటాయించి వారిలో ఆనందం నింపారు. అందుకే వారంతా మా మంచి సీఎం అంటూ జగన్‌ను ప్రశంసిస్తారు. ఎన్నికలవేళ హామీ ఇచ్చి 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడు మోసం చేశారంటూ ఇప్పటికీ ఆవేదన వ్యక్తంచేస్తుంటారు.

"మా ఆయన బాగా చదువుకున్నారు. 1998 డీఎస్సీలో అర్హత సాధించినా ఉద్యోగం రాకపోవడంతో ఎంతో వేదనకు గురయ్యేవారు. ఊరిలోని వ్యక్తుల సూటిపోటిమాటలకు బాధపడేవారు. కష్టపడి చదివినా ఫలితం లేకపోయిందంటూ మనోవేదన చెందేవారు. ఆర్థికంగానూ ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో మా ఆయనకు ఉద్యోగం వచ్చింది. సంతోషంగా ఉన్నాం. మేము ఉదయం లేచి ముందు చూసేది సీఎం ఫొటోనే. ఆయన మేలు ఎన్నటికీ మరచిపోలేనిది.

– జామి మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడి భార్య సంతోషం ఇది"

బాబూ నీకో దండం.. నీతో మరి ఉండం..!



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన కొత్తవలస టీడీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస ప్రాంతంలో ఎన్నో ఏళ్లగా టీడీపీఎలో కొనసాగుతున్న టీడీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు శుక్రవారం వైఎస్సార్ సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 5వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కత్తిరి గోపి, కత్తిరి చంద్రకళ, కత్తిరి కుసుమ, గవర ఫకీరు నాయుడు, ధనపతి రవికుమార్, మార్కొండ నాగరాజు, కత్తిరి వేణు, కర్రి వీర్రాజు, నేరడబిల్లి వెంకటరావు, సంగిరెడ్డి పైడయ్య, గుడ్డల నరసింగరావు తదితరులతో పాటు వారికి చెందిన సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు పార్టీలో చేరిన అందరికి సాదర స్వాగతం పలుకుతూ మీ అందరి అభీష్టానికి అనుగుణంగా జగనన్న పాలన సాగుతుందని అందరికీ పార్టీలో మంచి జరుగుతుందన్నారు. అందరూ కష్టపడి పనిచేసి సోమవారం జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఏకపక్షంగా ఓటింగ్ చేసి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కో ఆప్షన్ సభ్యుడు మేరువ వెంకటరావు, సీనియర్ నాయకులు చందక దేశాలు, వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్‌లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అడ్డగోలు రాతలు నమ్మొద్దు..



గొల్లలమర్రివలసలో మంత్రి బొత్స సత్యనారాయణకు హారతులిస్తున్న మహిళలు

- ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై ఈనాడు తప్పుడు రాతలు రాస్తోంది..
- మంత్రి బొత్స సత్యనారాయణ

మెరకముడిదాం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రవేశపెట్టిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఈనాడు రాస్తున్న తప్పుడు రాతలను నమ్మవద్దని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొర్లాం, గొల్లమర్రివలస, గరుగుబిల్లి, యాడిక గ్రామాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో మంత్రి బొత్స మాట్లాడుతూ, ఈనాడు పత్రిక ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌కు సంబంధించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై లేనిపోని అభాండాలు వేస్తూ తప్పుడు కథనాలు ప్రచురిస్తోందన్నారు. ఇలాంటి కథనాలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని.. ఈ విషయం రామోజీ రావు గమనించాలని సూచించారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించిన జగన్ మోహన్‌రెడ్డి తప్పుడు పనులు ఎన్నడూ చేయరని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పిన కల్లబొల్లి మాటలకు మోసపోవద్దని సూచించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి చీపురుపల్లి శాసనసభ్యుడిగా తనను, విజయనగరం పార్లమెంట్ సభ్యుడిగా బెల్లాన చంద్రశేఖర్‌నుఅత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.


అభివృద్ధే సేవకు తార్కాణం

మీ గ్రామాల్లో మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధే మేం చేసిన సేవకు తార్కాణమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల వేళ తెలుగుదేశం పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓటు అడుగుతున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలందరికీ తెలుసన్నారు. మీకు ఎవరు సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని చేపట్టారో విజ్ఞతతో ఆలోచించి ఓట్లు వేయాలని సూచించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెరకముడిదాం మండలానికి పరిశ్రమలు తీసుకువచ్చేందుకు మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు జంపన సావిత్రమ్మ, సర్పంచ్ బూర్లె పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.సీతారామరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కొర్లాం సభలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సైలెన్స్ ప్లీజ్..!



- నేటి సాయంత్రంతో మూగబోనున్న మైకులు
- అమల్లోకి 144వ సెక్షన్
- 12న పరిమితి సంఖ్యలో ఇంటింటి ప్రచారానికి అవకాశం

సాక్షి, పార్వతీపురం మన్యం: సార్వత్రిక ఎన్నికల సమరానికి మరికొద్ది గంటలే సమయం ఉంది. ఈ నెల 13న జరగనున్న ఎన్నికలకు యంత్రాంగం సిద్ధమవుతోంది. దాదాపు మూడు వారాలకుపైగా ప్రచారాలతో హోరెత్తిన మైకులు మరికొద్ది సేపట్లో మూగబోనున్నాయి. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల ప్రచారం 11వ తేదీ సాయంత్రం 6 గంటలతో ముగియనుంది. ఆ తర్వాత 144వ సెక్షన్ అమల్లోకి వస్తుంది. 12వ తేదీన డోర్ టు డోర్ ప్రచారానికి హంగూ ఆర్భాటాలూ లేకుండా పరిమితి సంఖ్యలోనే వెళ్లడానికి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణ, విందుల ఏర్పాటు, లౌడ్‌స్పీకర్ల వినియోగం వంటివి నిషేధం. అభ్యర్థుల తరఫున ప్రచారాలతో హోరెత్తించిన వాహనాలన్నింటికీ 11వ తేదీతో అనుమతి నిలిపివేస్తారు. ఎన్నికలకు 48 గంటల ముందు 11వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 13వ తేదీ రాత్రి 7 గంటల వరకు జిల్లాలోని మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. 144వ సెక్షన్ అమల్లో ఉండడంతో ప్రజలు గుంపుగా తిరగడం..ఆయుధాలు, తుపాకీలు, పదునైన ఆయుధాలు, లాఠీలు, కర్రలు, రాళ్లు వంటివి వెంట తీసుకువెళ్లడం నిషేధం.

హోరాహోరీగా ప్రచారం

జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు, అరకు ఎంపీ స్థానానికి సంబంధించి ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా..అదే నెల 25వ తేదీవరకు నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పార్లమెంట్ స్థానానికి 13 మంది, జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు 29 మంది బరిలో మిగిలారు. ఈ నెల 13న ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థులు నామినేషన్ వేసిన దగ్గర నుంచి ప్రచారం వరకూ తమ బలాన్ని నిరూపించుకునేందుకు పోటీపడ్డారు. ర్యాలీలతో హోరెత్తించారు. మరోవైపు ప్రశాంతంగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలూ తీసుకుంటోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 7,83,440 మంది ఓటర్లున్నారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 15,54,633 మంది. మొత్తం 1,031 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన శిక్షణ పూర్తి చేశారు.

మద్యం, డబ్బు పంపిణీపై నిఘా

ఎన్నికలకు ఇంకా రెండు రోజులే గడువు ఉండడంతో అభ్యర్థులు మద్యం, డబ్బు, ఇతర కానుకల పంపిణీపై దృష్టి సారించారు. కూటమి అభ్యర్థులు ఓటరును ప్రసన్నం చేసేందుకు కానుకల అస్త్రాన్ని ఉపయోగిస్తుండగా..అధికార వైఎస్సార్‌సీపీ తాము అమలు చేసిన సంక్షేమ పథకాలే మరోసారి అధికారం కట్టబెడతాయన్న నమ్మకంతో ఉంది. ఎటువంటి పొరపాట్లకూ తావివ్వకుండా జిల్లా అధికారులు ఈ రెండు రోజులూ నిఘా మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. లారీలు, ఇతర వాహనాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత కల్యాణ మంటపాలు, ఇతర ఫంక్షన్ హాల్స్‌లో జరిగే విందు భోజనాలపైనా నిఘా ఉంచుతున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అటువంటి కార్యకలాపాలు నిర్వహించిన వారిపైన, సంబంధిత ఫంక్షన్ హాల్ యాజమాన్యంపైన చర్యలు తీసుకుంటారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు జిల్లా విడిచి వెళ్లాల్సి ఉంటుంది. లాడ్జిలు, వసతి అతిథి గృహాలను తనిఖీ చేస్తారు.

సొంతూళ్లకు తరలివస్తున్న ఓటర్లు

పొరుగురాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో ఉంటున్న జిల్లాకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, వలస కూలీలు ఓటు వేసేందుకు సొంతూళ్లకు తరలివస్తున్నారు. రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో ముందుగానే గ్రామాలకు చేరుకుంటున్నారు. దీంతో బస్సులు, రైళ్లు కిటకిటలాడుతున్నాయి.

స్వేచ్ఛగా ఓటువేద్దాం..

- అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్
- ఉత్సాహంగా ఫ్లాష్ మాబ్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: ఓటర్లందరూ స్వేచ్ఛగా ఓటు వేయాలని అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. ఓటు మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని చెప్పారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దాసన్నపేట రైతుబజార్ జంక్షన్, గాంధీ బొమ్మ జంక్షన్, కలెక్టరేట్ జంక్షన్ వద్ద విద్యార్థులు శుక్రవాం ఫ్లాష్‌మాబ్ నిర్వహించి, ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్ సైతం విద్యార్థులతో కలసి నృత్యం చేసి ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవైసీ యాప్‌లో ప్రతి అభ్యర్థి వివరాలు ఉన్నాయని.. వాటిని చూసి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకుని శతశాతం ఓటింగ్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ శ్రీనివాసారావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, రిసోర్స్‌పర్సన్ పద్మనాభం, హౌసింగ్ అధికారులు, సిబ్బంది, ఆర్‌కే డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

హిందూ ఆలయాలకు గత వైభవం

- ఆలయ అర్చకులకు ప్రత్యేక గుర్తింపు
- పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణానికి నిధుల మంజూరు
- మూరుమూల, అల్పాదాయ దేవాలయాల్లో నిత్య ధూపదీప నైవేద్యం పథకం
- అర్చకుల ఖాతాల్లోకి నేరుగా నెలవారీ చెల్లింపు
- అర్చకుల రిటైర్మెంట్ తొలగించి, వంశ పారంపర్యం అమలు
- చంద్రబాబు హయాంలో నైవేద్యాలకు నోచుకోని దేవుళ్లు



లోహరిజోల ఆలయంలో నిత్యపూజలు చేస్తున్న అర్చకుడు



సతివాడ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

భామిని: గడిచిన చంద్రబాబు పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వాటిలో హిందూ దేవాలయాలు ప్రధానంగా ఉన్నాయి. ఆస్తులు ఉన్న దేవాలయాలు తప్ప అల్పాదాయం, మూరుమూల ఆలయాలను పట్టించుకోక ధూపదీప నైవేద్యాలకు కరువై ఆలయాలు మరుగున పడ్డాయి. దీనికి తోడు అర్చకత్వానికి వంశ పారంపర్యం రద్దు చేసి రిటైర్మెంట్ ప్రకటించి కష్టాలు కలిగించారు.మరుగున పడిన జీర్ణావస్థలో ఉన్న ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో కొత్త ఆలయాల నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టి హైందవుల ఆరాధనకు అవకాశాలు పెంచారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వెంటనే హిందూ ఆలయాలపై దృష్టి సారించి ముందస్తుగా అర్చకుల రిటైర్మెంట్ రద్దు చేసి వంశపారంపర్యం కొనసాగించి వారికి ఉపాధి భద్రత కల్పించారు.

పూజారుల్లో తొణికిసలాడిన సంతోషం

అల్పాదాయ, మారుమూల ఆలయాలలో నిత్య ధూప,దీప నైవేద్యాల పథకం కింద నెలకు రూ.5వేలు చొప్పున అర్చకుల ఖాతాలకే ప్రభుత్వ చెల్లించడంతో వారు ఆలయాల్లో నిత్యభోగాలు పెట్టించారు. ఇల్లు లేని పేద అర్చకులకు ఇంటి స్థలం కేటాయించి జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేవాలయ బోర్డుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అందరికీ సమాన భాగస్వామ్యం కల్పించింది. టీటీడీ సహకారంతో ప్రతి ఆలయానికి ఓ గోవు అంటూ ప్రతి దేవాలయంలో నైవేద్యానికి పాడి ఆవు, దూడలు అందించారు.

జిల్లాలో ఇలా..

పార్వతీపురం మన్యం జిల్లాలో గల 218 ఆలయాల్లో 198 ప్రభుత్వ పథకం పరిధిలోకి వచ్చాయి. వాటిలో నిత్య ధూప,దీప నైవేద్య పథకం కిందికి 150 దేవాలయాలను తీసుకువచ్చారు. ఇందులో డాక్టర్ వైఎస్సార్ కాలంలోనే 65 ఆలయాల్లో నైవేద్య పథకాన్ని కొనసాగించారు. అయితే చంద్రబాబు కాలంలో వాటిని నిలిపివేశారు. ప్రస్తుతం ఈ పథకం ద్వారా నెలకు రూ. 5 వేలు చొప్పున దేవాదాయ శాఖ నుంచి ఆర్థిక సాయం కింద ఆయా అర్చకుల అకౌంట్‌కు జమ చేస్తూ దేవాలయాల్లో నిత్యభోగం పెట్టిస్తున్నారు.

డీడీఎన్ఎస్ ద్వారా అర్చకులకు




"జగనన్న ప్రభుత్వ నిర్ణయం గొప్పది.పురాతన ఆలయాల్లో దీపాలు వెలిగించారు. నైవేద్యాలు పెట్టించారు.అర్చకుల కష్టాలు తీర్చేందుకు నెలవారీ వేతనాలు ఖాతాల్లో వేస్తున్నారు. ఈ మహత్తర పథకంతో అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపారు. అర్చకుల రిటైర్మెంట్ తొలగించి వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆరాధనపై బాధ్యత పెంచారు. దేవుడి సేవకు అవకాశం పెంచారు. పురాతన ఆలయాల పునరుద్ధరణకు నిధుల కేటాయింపుతో మరిన్ని అవకాశాలు మెరుగుపర్చారు. జగనన్న ప్రభుత్వ విధానాన్ని అర్చక లోకం ముక్త కంఠంతో స్వాగతిస్తోంది.

– మీగడ సంతోష్‌కుమార్, జిల్లా కార్యదర్శి, ఐక్య జంగం సంక్షేమ సంఘం, పార్వతీపురం మన్యం జిల్లా"

పురాతన దేవాలయాలకు నిధులు

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో 125 మూరుమూల గిరిజన ప్రాంతాల్లోని పురాతన దేవాలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో 100 ఆలయాల నిర్మాణం పూర్తిగా పాలకొండ నియోజకవర్గానికే కేటాయించడం విశేషం. మిగతా గ్రామాల్లో నూతనంగా ఆలయాల నిర్మాణానికి ముందస్తుగా రూ.5లక్షలు చొప్పున కేటాయించారు.

- ఎస్.కోటలో 28 ఎకరాల్లో జగనన్న లేఅవుట్
- 1,004 మందికి ఇళ్ల పట్టాలు
- పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు 300
- వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు: 554
- తాగు, వాడుక నీటి సదుపాయం కోసం కేటాయించిన నిధులు రూ.2.89 కోట్లు
- రూ.60 లక్షలతో విద్యుత్ సౌకర్యం
- రూ.3 కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్‌లు, కల్వర్టులకు ప్రతిపాదనలు


ఎస్.కోటలోని వైఎస్సార్ జగనన్న కాలనీ

కోటలో కొత్త ఊరు

శృంగవరపుకోట:

పేదల సొంతింటి కల నిజం చేస్తానంటూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అక్షరాలా నిజం చేశారు. దశాబ్దాలుగా ఎస్.కోటలో ఉన్న నిరుపేదలు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్లు మంజూరు చేయాలని ఎన్నో దఫాలు పోరాటాలు ఉద్యమాలు చేశారు. ఎవరు ఎన్ని పోరాటాలు చేసి నా కోటను ఏలిన తెలుగుదేశం పార్టీ పాలకులు ఏనాడూ పట్టించుకోలేదు. అక్కా ఒక్కసారి మాకు అధికారం ఇవ్వండి మీ కలలు నిజం చేస్తానంటూ మాటిచ్చి అధికారం అందుకున్న రెండేళ్లలోనే పేదోడి సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేసి వారి గుండెల్లో చోటు సంపాదించుకున్నారు. ఎస్.కోటలో కోట్ల రూపాయల విలువ చేసే 28 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించారు. యుద్ధ ప్రాతిపదికన కోట్లు ఖర్చు పెట్టి రేయింబవళ్లూ పనులు చేసి, భూమిని అభివృద్ధి చేసి లేఅవుట్ వేయించారు. జిల్లాలోనే అతిపెద్ద 2వ జగనన్న కాలనీ అయిన ఈ లేఅవుట్ కొత్త ఊరుగా రూపుదిద్దుకుంది.

1,004 మందికి పట్టాలు

పేదరికమే అర్హతగా పార్టీలకతీతంగా పట్టణానికి చెందిన 1,004 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేసింది. దరఖాస్తు చేసుకున్న 859 మందికి ఇళ్లు మంజూరు చేశారు. వీరిలో ఇప్పటికే 300 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి నివాసం ఉంటున్నారు. 554 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రూ.2.89 కోట్లతో నీటి సదుపాయం

ఇళ్ల నిర్మాణం కోసం కావాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కల్పించింది. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి వాడుకనీరు, జనానికి తాగునీరు కోసం రూ.2.89 కోట్లు కేటాయించారు. కాలనీలో 10 బోర్లు తీయించారు. 60 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, 15 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు సంప్‌లు, 1,100 కుళాయిలకు ఈ నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే 200 కుళాయిలు ఏర్పాటు చేసి నీరు అందిస్తున్నారు.

రూ.60 లక్షలతో విద్యుత్ సదుపాయం

కాలనీకి విద్యుత్ అవసరాల కోసం రూ.60 లక్షలు కేటాయించారు. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు–16, 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు– 4, 1200 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అడిగిందే తడవుగా ప్రతి ఇంటికి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తున్నారు.

రూ.3 కోట్లతో రోడ్లకు ప్రతిపాదనలు

ప్రస్తుతం కాలనీలోకి వెళ్లేందుకు స్లాబ్ కల్వర్టుకు రూ.10 లక్షలు కేటాయించారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్ల కోసం మరో రూ.3 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి గడపకూ విద్యుత్, తాగునీటి కుళాయి, వీధిరోడ్డు, కాలనీలో పార్కులు, సచివాలయం, అంగన్‌వాడీ, హెల్త్ క్లినిక్ ఏర్పాటుకు స్థలాలు కేటాయించారు.



జగన్ చేసిన మేలు మరిచిపోలేం...

చాలా ఏళ్లుగా అద్దె ఇళ్లలో ఉన్నాం. జగన్ ఇంటి స్థలం ఇస్తానంటే ముందు నమ్మలేదు. ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. ప్రభుత్వం అందించిన సహాయం, కల్పించిన సదుపా యాలతో ఇంటి నిర్మాణం పూర్తి చేశాం. ఇప్పుడు ఆయన ఇచ్చిన ఇంటిలో చల్లగా ఉన్నాం. జగన్ చేసిన మేలు మరిచిపోలేం.

– ఆలవెల్లి వెంకటరత్నం, లబ్ధిదారు.

పేదోళ్ల గౌరవం పెంచిన నాయకుడు



పేదోళ్ల గౌరవం పెంచిన నాయకుడు జగన్. సొంత ఇల్లు లేక సంఘంలో గౌరవం, హోదా లేక, అద్దెలు కట్టలేక అవస్థలు పడుతున్న వేలాది మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేశారు. ప్రభుత్వమే లబ్ధిదారుల పేరు న ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించి హక్కులు కల్పించారు. సీఎం జగన్ పేదోళ్ల గౌరవం పెంచిన నాయకుడు.

– మేడపాటి కుమారి, లబ్ధిదారు

మాట నిలబెట్టుకున్నారు..



జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలకు లంచాలు, సిఫార్సులకు తావులేకుండా, ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు ఇచ్చి పేదల కలను నిజం చేశాడు. ఇన్నేళ్లు పాలించి ఏమీ ఇవ్వలేని నాయకులు సిగ్గు లేకుండా ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతున్నారు.

– ఆదిమూలం పార్వతి, లబ్ధిదారు

నాకు హోదా, ఆస్తి ఇచ్చింది జగన్



పేదోడి కష్టం, కల తెలిసినోడు జగన్. కూలి చేసుకుంటూ పరాయి పంచల్లో ఉండేదాన్ని. సీఎం జగన్ ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేశారు. ఈ రోజు ధైర్యంగా నా సొంత ఇంట్లో ఉన్నా, నాకు హోదా, ఆస్తి ఇచ్చింది జగనే.

– కోదూరు పైడితల్లమ్మ, లబ్ధిదారు

అష్టకష్టాలు 'నాయనా'?

- బొబ్బిలిలో గెలవలేమని టీడీపీ అభ్యర్థి బేబీ నాయనకు బెంగ!
- రెండేళ్లుగా గెలుపు తనదేనంటూ మీడియాలో తెగ ప్రచారం
- క్షేత్రస్థాయిలో పరిస్థితులన్నీ తారుమారవడంతో తలపట్టుకుంటున్న వైనం



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచే తనదే విజయం అన్నట్టుగా సోషల్ మీడియాలో, ఎల్లో మీడియాలో తెగ ప్రచారం చేయించుకున్న సదరు నాయకుడికి తీరా ఎన్నికలు వచ్చేసరికి క్షేత్రస్థాయిలో పరిస్థితులన్నీ తారుమారైపోయాయి. ఆయనెవ్వరో కాదు ప్రజాతీర్పును కాలదన్ని పదవుల కోసం వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించి ఇప్పుడు బొబ్బిలి నుంచి బరిలోకి దిగిన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు ఉరఫ్ బేబీ నాయన!. అష్టకష్టాలు ఆయన్ను చుట్టుముట్టాయని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కలసిరాని సామాజిక వర్గం...

అసలే తక్కువ సంఖ్యాబలం ఉన్న బేబీనాయన సామాజిక వర్గం ఇప్పుడు కలసి రావడం లేదు. గతంలో సుజయ్ కృష్ణ పోటీ చేసినప్పుడు అండగా నిలబడినవారే ఇప్పుడు తేడా కొడుతున్నారు. సుజయ్‌కూ బేబీ నాయనకూ తేడా ఉండడమే కారణమట! సుజయ్‌కు తన సామాజిక వర్గానితో ఉన్నంత సాన్నిహిత్యం బేబీ నాయనకు లేదట. బొబ్బిలి పట్టణంలో ఇది ప్రభావితం చేస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి. పోనీ బీసీలైన కొప్పుల వెలమలనూ కలిపేసుకుందామంటే... ఎన్నికలప్పుడు తప్ప మరెప్పుడు వారిని కోటగుమ్మం కూడా ఎక్కనివ్వరే! విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఇన్నాళ్లూ వెన్నుముకగా ఉన్న తమకు ఒక్క సీటు కూడా చంద్రబాబు కేటాయించకపోవడంతో కొప్పుల వెలమ నాయకులు రగిలిపోతున్నారు. వెన్నుపోటు పొడిచే చంద్రబాబుకు ఓట్లతో బుద్ధి చెబుతామని ఇప్పటికే జిల్లా అంతా పోస్టర్లు వేసి మరీ హెచ్చరించడం తెలిసిందే.

ఆర్థిక నిల్వలు అయిపోయాయా?

బొబ్బిలిలో గెలుపు తనదేనంటూ రెండేళ్ల కిందట నుంచే బేబీ నాయన ప్రచారం చేయించుకున్నారు. ఇందుకోసం అహో ఓహో బ్యాచ్‌కి అన్ని ఖర్చులు చూసుకుంటూ వచ్చారు. ఇప్పుడు తీరా ఎన్నికలు వచ్చేసరికి వారంతా మళ్లీ డబ్బులు కావాలని అడుగుతున్నారట! కొంతమంది అలిగి కోట గుమ్మం కూడా ఎక్కట్లేదట! మిగతా వారు ఖర్చుల కోసమైనా ఇప్పించండంటూ బేబీ చుట్టూ తిరగాల్సి వస్తోందట! అయితే ఈసారి ఎన్నికల ఖర్చు విషయంలో కుటుంబ వర్గం ఫ్రీహ్యాండ్ ఇవ్వలేదని, అందుకనే ఈ ఇబ్బందులని బేబీ సన్నిహితులే చెప్పుకుంటున్నారు.

అశోక్ దెబ్బ అదుర్స్...

ఏ రఘురామకృష్ణ రాజో, సీఎం రమేషో, లేదంటే గంటా శ్రీనివాసరావో విజయనగరం ఎంపీ అభ్యర్థిగా వస్తే ఖర్చు కలిసొస్తుందనుకుంటే సీన్ రివర్స్ అయ్యింది. బొబ్బిలి రాజుకు విజయనగరం రాజు అశోక్ నొప్పి తెలియకుండా కొట్టిన దెబ్బ అదుర్స్ అనిపిస్తోంది. ఆ ముగ్గురిలో ఎవరు విజయనగరంలో అడుగుపెట్టినా ఏకులా వచ్చి మేకు అవుతారని, చివరకు కళావెంకటరావు ఎంపీ అభ్యర్థిగా వచ్చిన తన ఆధిపత్యానికి ఇబ్బంది అవుతుందని అశోక్ భావించారో ఏమో కానీ... అనూహ్య రీతిలో కలిశెట్టి అప్పలనాయుడిని తెరపైకి తెచ్చారు. విజయనగరం జిల్లాకు ఏమాత్రం పరిచయం లేదు సరికదా ఆర్థికంగానూ ఏమాత్రం ఖర్చు పంచుకోలేని పరిస్థితి కలిశెట్టిది. ఓట్లలోనూ, నోట్లలోనూ కలిసిరాని కలిశెట్టి తనకు భారమేనని బేబీ బెంగపడుతున్నారట!

బొబ్బిలి రాజంటే మాటలా...

వాడుకోవడంలో చంద్రబాబుకు మించినవారు లేరనేది బహిరంగ రహస్యం. కానీ ఆయన్నే మెప్పించి పార్టీకి విధేయుడిగా, పార్టీని ఆదుకునే నాయకుడిగా ముద్ర వేయించుకోవడానికి బొబ్బిలి రాజు గతంలో స్థాయికి మించి ఖర్చు చేసేశారు. ఇప్పుడదే ఆయనకు ఇబ్బందిగా మారింది. బొబ్బిలి రాజు అంటే మాటలా... ఆయనకే బోలెడు నిధి ఉంటుందనే రీతిలో పార్టీ అధిష్టానం భావిస్తుందట. పైసా కూడా పార్టీ ఫండ్ రావట్లేదట!

ఫిరాయింపు మచ్చ...

బేబీ నాయన ప్రజల్లోనూ పలుచన అవ్వడానికి, ప్రచారంలోనూ వెనుకబడటానికి మరో ప్రధాన కారణం గతంలో పార్టీ ఫిరాయించడమే. వైఎస్సార్ సీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంగా రాష్ట్రస్థాయి పదవీ బాధ్యతలు అప్పగిస్తే... కేవలం రెండేళ్ల పాటు ఉండే మంత్రి పదవి కోసం టీడీపీలోకి జంప్ చేసేశారు. సంతలో పశువులా అమ్ముడు పోవడాన్ని నియోజకవర్గ ప్రజలు బాగా గుర్తుంచుకున్నారు. కార్యకర్తలు, కౌన్సిలర్ స్థాయిలో ఉన్న వారు కూడా మేం పార్టీ మారబోమని ఖరాకండీగా చెప్పినప్పటికీ నేరుగా అమ్ముడు పోవడం బొబ్బిలి రాజుల రాజకీయ జీవితాన్ని ప్రభావితం చేసిందని ప్రజలు అంటున్నారు.

ఏమైనా చేస్తే కదా చెప్పుకోవడానికి...

వై.ఎస్.రాజశేఖరరెడ్డి భిక్ష పెట్టిన రాజకీయ జీవితంలో ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మకంతో మూడుసార్లు ఎమ్మెల్యే అయిన సుజయ్ కృష్ణ రంగారావు, మున్సిపల్ చైర్మన్‌గా పదవి దక్కిన బేబీ నాయన బొబ్బిలి నియోజకవర్గంలో పిసరంత అభివృద్ధి పనిలేకపోవడం ఇప్పుడు మైనస్ అవుతోంది. మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలంటూ ప్రస్తుత ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఎన్నోసార్లు సవాల్ విసిరినా బేబీ నాయన నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోవడానికీ కారణమూ అదే.

దిగిందమ్మా కారు బ్యాచ్...

గతంలో సుజయ్ ఓటమికి ఓ కారణమైన ఆయన సన్నిహితులు (కారు బ్యాచ్ అని బొబ్బిలిలో పేరు) మళ్లీ రంగంలోకి దిగడం బేబీ నాయనకు గడ్డు కాలం దాపురించిందనే చెప్పాలి. వారం రోజులుగా ఒక్కటే హడావిడి చేస్తున్నారు.

పూర్తిస్థాయి ఏర్పాట్లు


రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు పరిశీలిస్తున్న శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా


ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మరో పక్క స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏర్పాట్లను కళాశాలలో శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా శుక్రవారం పర్యవేక్షించారు. ఎన్నికల పరిశీలకుల సూచన మేరకు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా రిసెప్షన్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. పోలింగ్ ముగిశాక 13వ తేదీ రాత్రి వేళ బస్సుల్లో ఈవీఎంలు రిసెప్షన్ కేంద్రాలకు తరలిస్తారు. రిసెప్షన్ కేంద్రాల నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ప్రధానంగా జాతీయ రహదారి నుంచి కళాశాల వెలుపల నుంచి రోడ్లు నిర్మిస్తున్నారు. పార్కింగ్, ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలు కళాశాలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. గత ఎన్నికల్లో పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాంటి పరిస్థితులు రాకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో సాగుతున్నారు.

గెలుపు కేక

ఊరూరా గెలుపు కేక వినిపించింది. సంక్షేమ పాలనకే మా ఓటు అన్న నినాదం మిన్నంటింది. ప్రతి కుటుంబం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు హారతిచ్చి మనసారా ఆశీర్వదించింది. ప్రతి పల్లె విజయీభవ అంటూ దీవించింది.

– సాక్షి నెట్‌వర్క్

ప్రచార పర్వం


భోగాపురం మండలం సవరవిల్లిలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు అపూర్వస్వాగతం లభించింది. గ్రామస్తులందరూ వారి వెంట నడిచారు. గజమాలతో సత్కరించి, ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అంటూ నినదించారు.


వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ బొద్దాంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ వర్షిణి హారతిచ్చి విజయతిలకం దిద్దారు.


రామభద్రపురం మేజర్ పంచాయతీలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకటర చినఅప్పలనాయుడుకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతిచ్చి విజయతిలకం దిద్దారు.


గజపతినగరంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్‌గుర్తుకు ఓటేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు.


వేపాడ మండలం పి.కె.ఆర్.పురంలో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు గ్రామస్తులందరూ అండగా నిలిచారు. ప్రచారంలో పాల్గొని గెలుపుభరోసా ఇచ్చారు.

గిరిజనం హర్షం

- ఆదివాసీలు ఉన్న చోటే గిరిజన వర్సిటీ
- నిర్మాణ ప్రదేశం మార్చాలన్న చంద్రబాబు కుట్రలకు చెక్
- మొదలైన యూనివర్సిటీ పనులు
- నిర్మాణానికి ఇప్పటికే రూ.800 కోట్లు మంజూరు



ఆగస్ట్25న గిరిజన వర్సిటీ భూమి పూజకు వచ్చిన కేంద్ర గిరిజన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బొబ్బిలి వీణ అందచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి (ఫైల్)

దత్తిరాజేరు:

గిరిజనులు అధికంగా ఉన్న అరకు పార్లమెంట్, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ నిర్మాణం చేపట్టడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం హయంలో గిరిజనులు లేని చోట విశాఖపట్నం దగ్గరలో కొత్తవలస మండలంలోని రెల్లి గ్రామం వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం భూసేకరణ చేయడంతో అక్కడ అనువైన ప్రదేశం కాదని నిపుణులు అప్పట్లోనే చెప్పారు. దీంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విద్యకు పెద్ద పీట వేయడంలో ముందుంది. ఈ నేపథ్యంలో సాలూరు–గజపతినగరం నియోజకవర్గాల మధ్య గిరిజన మండలమైన మెంటాడ–దత్తిరాజేరు మండలాల మధ్య 561.88 ఎకరాల భూమిని ప్రభుత్వ సేకరించింది. ఆ రెండు మండలాల పరిధిలో 90 ఎకరాల భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారాన్ని సంతృప్తికరంగా ప్రభుత్వం చెల్లించింది. రైతుల నుంచి సేకరించిన ఎకరా జిరాయితీ భూమికి రూ.9లక్షలు, ఎసైన్డ్ భూములకు రూ.7లక్షల నుంచి రూ.9లక్షల వరకు పరిహారంగా ప్రభుత్వం అందజేసింది.


గిరిజన యూనివర్సిటీ ఆవరణలో నిర్మాణంలో ఉన్న 20లక్షల లీటర్ల నీటి సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంక్

రైలు, విమాన మార్గాలకు దగ్గరగా

జాతీయ రహదారికి కిలోమీటరున్నర దూరంలో మర్రివలసలో యూనివర్సిటీ నిర్మాణం చేపట్టడం వల్ల వైజాగ్ సముద్రానికి 70 కిలో మీటర్ల దూరం, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు 60 కిలోమీటర్ల దూరంలో వాయు, జలరవాణా అందుబాటులో ఉంటాయి. అలాగే అటు విజయనగరం ఇటు బొబ్బిలి రైల్వేస్టేషన్లకు కూడా జాతీయ రహదారి దగ్గరగా ఉండడంతో దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు ప్రయాణం సులభతరమవుతుంది. దీంతో వెనుకబడిన ఈప్రాంతం కూడా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది ఆగస్టులో భూమిపూజ

గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ప్రభుత్వం చేపట్టిన చొరవను చూసి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 2023 ఆగస్టు 25న గిరిజన యూనివర్సిటీకి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి మెంటాడ మండలంలోని కుంటినవలస వద్ద శంకుస్థాపన చేశారు.

త్వరితగతి వర్సిటీ నిర్మాణం

ప్రభుత్వం సేకరించిన 561.88 ఎకరాల్లో ప్రస్తుతం 20 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం ఏడు కోట్ల రూపాయలతో జరుగుతోంది. గిరిజన యూనివర్సిటీ స్థలం చుట్టు ప్రహరీ నిర్మాణానికి మార్కింగ్ పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు స్థల సేకరణ ఇప్పటికే పూర్తి చేశారు. యూనివర్సిటీ మధ్యలో వాచ్‌టవర్ నిర్మాణం పూర్తయింది. ప్రభుత్వం రూ.800 కోట్ల నిధులు మంజూరు చేయడంతో భవనాల నిర్మాణం చేపట్టనున్నామని అధికారులు తెలియజేస్తున్నారు.

టీడీపీ కుట్రలు సాగవు

గిరిజన యూనివర్సిటీని గతంలో అనువుగాని చోట నిర్మించాలని టీడీపీ ఎన్నో కుట్రలు చేసింది. గిరిజనులు ఉన్న చోట నిర్మించాలని ఎంతో మంది నిపుణులు ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేయడంతో గిరిజన నియోజకవర్గమైన సాలూరులో నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. నిర్మాణానికి కావలసిన భూములు సాలూరు నియోజకర్గంలోని మెంటాడ మండలం చినమేడపల్లితో పాటు గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల్లో సేకరించడంతో గిరిజన వర్సిటీ నిర్మాణానికి అధికారులు సిద్ధమయ్యారు. ఈ ప్రాంతం విద్యాపరంగా అభివృద్ధి చెందుతుంది. యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నది ఈ ప్రాంతీయుల మాట.


యూనివర్సిటీ మధ్యలో నిర్మాణం జరిగిన వాచ్‌టవర్